# అతడు - ఆమె

"అమరశ్రీ"

అతడికింకా పెళ్ళికాలేదా? ఇబ్బంది లేదు. అతడు ఆమె కాదుగా? అటువంటప్పుడు ఏమీ ఫరవాలేదు. పెళ్ళి కాకపోతే ఏం? అతడు నలభై ఏళ్ళ లోపున ఎప్పుడైనా పెళ్ళి చేసుకోవచ్చు. పెళ్ళి చేసుకోకుండానే జీవించటం చేతనయినట్లయితే జీవించవచ్చు. కాదనేవాడెవడు?

బ్రహ్మచారి. ఈ ప్రపంచంలో, అందులో అమెరికాలాటి దేశంలో పురుషుడికి రెట్టింపు మూడంతలు స్త్రీలు ఉన్న దేశంలో జన్మాంతమూ బ్రహ్మచారిగా ఉండటం ఎంత కష్టం! బ్రహ్మచారిగా ఉండటమంటే పెళ్ళి చేసుకోకుండా ఉండటం. నూటికి ఎంతమంది వున్నారు ఈ రకంవాళ్ళు? చాల తక్కువ మంది. జ్వరం వస్తే ఎట్లా? చేసేదెవరు? ముసలితనంలో పక్షవాతం వస్తే? అంతవరకు ఎందుకు? బాగా ఉన్ననాడే ఏ కారుక్రిందన్నా పడి కాలో, చెయ్యో విరగగొట్టుకుంటే సహాయం చేసేదెవరు? అదీగాక వంశ వృక్షం వృద్ధిపొందేదెలా? ఒక్కొక్క రకంవాళ్ళు ఒక్కొక్క ప్రశ్న వేసుకొని ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా పెళ్ళి చేసుకొంటారు.

అతడు పెళ్ళి చేసుకోడనుకోండి. పిల్లనివ్వటానికెవడూ ఇష్టపడడనుకోండి. పెళ్ళిచేసుకోకపోవటం గూడ ఒక ఉద్ధరణేనంటాడతడు. కాదనగలదెవరు? ఏ పని చేసినా తనను తాను సమర్థించుకోగల వాడతడు.

పెళ్ళి చేసుకోకపోతేనే చాల సుఖపడతానను కుంటాడు. భార్యను తన అధికారంక్రింద ఉంచుకో ప్రయత్నించనక్కరలేదు. అనుమానించనక్కరలేదు. పోషించనక్కరలేదు. ఆమె కన్న పిల్లలను, పెట్టి పోషించి పెద్దవాళ్ళను చేయనక్కరలేదు.

ఒకొక్కప్పుడు పెళ్ళి చేసుకుంటేనే బాగుంటుందనుకొంటాడు. కారణాలు అనేకం. పెళ్ళాంమీద అధికారం సంపాదించవచ్చు. తను ఒకడి క్రింది ఉద్యోగి అయినా తను భార్యను ఇష్టంవచ్చిన మూసలో పోసుకోవచ్చు.

కాబట్టి పెళ్ళి చేసుకోవటమో, చేసుకోకపోవటమో ఏదో ఒకటి చేయవచ్చు. పెళ్ళి చేసుకోకపోతే అడిగేదెవరు? అతడు పెళ్ళి చేసుకోకపోతే ఏ ఒక్కడు వేలుపెట్టి చూపించరు. అతన్ని కూరాకులో చీడపురుగుని చూసినట్లు చూడరు. అతని తల్లిదండ్రులను వెలివేయరు. అతడు పెళ్ళి చేసుకోకపోతే అతడి అప్పచెల్లెళ్ళకు పెళ్ళి కాదనే దిగులు లేదు.

ఒకసారి పెళ్ళిచేసుకుంటే పెళ్ళాం చనిపోయినా దిగులుపడనక్కరలేదు. నిశ్చితంగా మరో పెళ్ళి చేసుకోవచ్చు. ఎవరూ కాదనరు. అతడు గనుక గతించిన పెళ్ళాంకోసం విప్రలంభం పాలుగాకుండా ఉంటే మరో పది పెళ్ళిళ్ళు చేసుకోవచ్చు. ఒకటి తరువాత మరొకటి. పదహారువేల గోపికలతో కాపురంచేసిన శ్రీకృష్ణుడు అతడికి ఆదర్శం. అయితే ఈమధ్యనే మన ప్రభుత్వం ఒక పనిచేసింది. అంతమంది పెళ్ళాలతోనూ ఒకేసారి కాపురం చేయగలిగిన అవకాశాన్ని పోగొట్టారు. కాబట్టి ఏపరిస్థితుల్లోనూ అతడు శ్రీకృష్ణుడు కాలేడు.

ఇదంతా అనవసరం. పూర్తిగా పెళ్ళి చేసుకోవటం మానుకున్నా అడిగేవాడు లేడు. ఆక్షేపించేవాడూ లేడు. రజస్వల కాకముందే వివాహం జరిగితీరాలన్న ఇబ్బంది లేదు. వయస్సు ముదరకముందే వివాహం జరగాలన్న విధిలేదు. అతడు చదువుకున్నవాడయినా ఫరవాలేదు. లేకపోయినా ఫరవాలేదు. సంగీతం కూడ పాడటం చేతగానక్కరలేదు. అంట్లు తోమటం, ఇల్లు ఊడ్చటం లాటిపనులు గూడ చేయగలిగి ఉండనక్కరలేదు. అతడు అతడయితే చాలు, ఆమె కాకుండా.

అతడు "పతివ్రతుడు" కానక్కరలేదు. ఏకపత్నీవ్రతం అతడికి అనవసరం. అతడు ఎన్ని బజార్లయినా తిరిగిరావచ్చు. అతడు అతడే

గాబట్టి. అతడు ఎన్ని తప్పులు చేసినా సరి దిద్దుకోగలడు. అవన్నీ తప్పులేగావు. అతడు ఇటువంటి తప్పులకీ, ఒప్పులకీ, అన్నిటికీ అతీతుడు.

అతడు సర్వస్వతంత్రుడు. ఎవరేమన్నా సహించడు. అతడిని తిట్టటానికిగాని కొట్టటానికి గాని భగవంతుడికి తప్ప మరెవరికీ తగదు. అతడు చాలమందికి స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తాడు. జంతువులకు ముఖ్యంగా జంతువుల లాటి మానవులకు అతడు తన ఇష్టమైనట్లయితే పూర్ణ స్వాతంత్ర్యాన్నిస్తాడు. ఏ పరిస్థితిలో నైనా అతడు స్వేచ్ఛాజీవే.

పెళ్ళికాని ఆడపిల్లల తండ్రులను వెలి వేయ వచ్చు అతడు. సంఘనుండి బహిష్కరించవచ్చు. నానామాటలూ అనవచ్చు. అతడు పాతిక సంవత్సరాలవాడు కావచ్చు. అవివాహితుడు కావచ్చు. పదిహేనేళ్లు దాటిన ఆడపిల్లలకు పెళ్ళి కాకపోతే అతడు ఆక్షేపిస్తాడు. ఆక్షేపించే అధికారాన్ని అతడికి ప్రసాదించింది ఈ సంఘం. సంఘం అంటే ఎవరు? అతడే. అతడికి తప్ప మరొకరికి ఈ సంఘంలో స్థానంలేదు. అతడికి అతడే అధికారాన్ని ప్రసాదించుకున్నా డన్న మాట.

అతడు అస్తమానమూ 'ఆమె'కోసం పాటు బడుతున్నట్లు కనుపిస్తాడు. వేదిక ఎక్కి ఉప న్యాసాలిస్తాడు. గొంతు చించుకొని అరు స్తాడు. పత్రికలలో వ్రాస్తాడు. తన భార్య మాత్రం తన పెళ్ళాడిన పెళ్ళామేనంటాడు అతడు. అతడితో మనం వాదించలేం. వాదించి గెలవలేం కూడ. తన మూలంగా మిగతావాళ్లు చాలమంది ఉద్ధరింప బడుతున్నారని అతడి ఊహ. ముఖ్యంగా 'ఆమెను' తనేదో ఉద్ధరిస్తు న్నట్లు, రక్షిస్తున్నట్లు భావిస్తాడు. కనీసం 'ఆమెను' బాగుచేస్తున్నా ననుకొంటాడు.

అతడికి చాల గర్వమున్న దంటారు చాల మంది. ఉన్నదని అంగీకరిస్తాడు అతడు. ఉండాలని వాదిస్తాడు. ఎందుకు? అని అడిగితే అతడై పుట్టినందుకే నంటాడు.

అతడు అతి మేధావి. విమానం, ఆటం బాంబు, హైడ్రోజన్ బాంబు, లెక్కలుచేసే యంత్రం మొదలైనవాటిని కనిపెట్టాడు. 'ఆమె' కూడ చాల కనిపెట్టింది. వాటన్నిటినీ తన ప్రభావం వలననే కనిపెట్టగలిగిం దంటాడు అతడు. అతడే చెప్పుకొంటాడు ఇదంతా.

అతడు చాల మంచివాడు. అతడు చాల మంచివాడని 'ఆమె'కూడ అంగీకరిస్తుంది. కాని పూర్తిగా, ప్రతి విషయంలోనూ అన్ని పరిస్థితు లలోనూ 'ఆమె' అతడిని మంచివాడిగా ఎంచదు. అతడు ఇష్టం వచ్చినట్లు 'ఆమె'ను సినిమాలకూ, నాటకాలకూ, తీసుకుపోడు. పార్కులలో ఇష్టం వచ్చినపుడు, ఇష్టం వచ్చి నట్లు తిరగనివ్వడు. మరో పురుషుడితో ఆమె కులాసాగా మాట్లాడుతుంటే అతడు సహించ లేడు. అందుచేతనే ఒక్కొక్కప్పుడు "ఆమె" దృష్టిలో అతడు మంచివాడుకాడు.

ఒక తండ్రి అన్నాడట ఒకాయనతో. "మావాడి గుణాలన్నీ మంచివే గానీ రెండే రెండు గుణాలు బాగాలేవు. ఒకటేమి టంటే, వాడికి బుర్రలేదు కాబట్టి తోచదు. రెండోది, ఇంకొకరు చెప్పితే వినడు" అని.

అన్నీ బాగానే ఉన్నయ్. కాని అతడు ఒక్కొక్కచోట, ఒక్కొక్క విషయంలో చాల దురదృష్టవంతుడు. ఒక్క చిన్న విష యంలో అతడికి బాగా అన్యాయం జరిగింది.

రైలుపెట్టెల విషయంలో అతడికి జరిగిన అన్యాయం చాల ఉన్నది. అతడు కొన్ని పెట్టెలు తనకోసం అట్టిపెట్టుకొనేలా చేయ బడింది. ఒకటో రెండో "ఆమె"కు ఇచ్చివేయ బడినయ్. అతడి పెట్టెలలోకి ఆమె జొరబడి కూర్చోవచ్చు. కాని పొరబాటున కూడ అతడు ఆమెపెట్టెలోకి వెళ్ళకూడదు. అది అమర్యాద. పైగా ఈపద్ధతి సమానత్వానికి చిహ్నమనే వాళ్లున్నారు చాలమంది.

మగపిల్లల స్కూళ్ళలోకీ, కాలేజీలలోకీ ఆమె పోవచ్చు. విద్యాభ్యాసం చేయవచ్చు. అతడు స్త్రీల కళాశాలల్లో కాలు పెట్టటానికి వీల్లేదు.

'ఆమె' అతడివంక తీక్షణంగా చూడవచ్చు. చేతనైతే మాట్లాడవచ్చు. అతడు పరస్త్రీని కన్నెత్తి చూడకూడదు. పాపం!

కొన్నికొన్ని విషయాలలో అతడు దెబ్బ తిన వలసి వచ్చింది. అయితేనేం? అతడొక గొప్ప మేధావి.